నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 2 సెప్టెంబర్ 2024 | HYDERABAD



హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారడంతో దిగువకు వదిలిన వరద నీరు



అలుగు పారుతున్న నాచారం చెరువు

# రికాం లేని వాన

స్తంభించిన జనజీవనం.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

నేలకొరిగిన చెట్లు..విద్యుత్ సరఫరాకు ఆటంకం

పునరుద్ధరణకు ఆలస్యం..పలు చోట్ల అంధకారం

అల్లాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో

నీట మునిగిన ఇండ్లు.. సహాయక చర్యల్లో నిర్లక్ష్యం..

ఇబ్బందులుపడ్డ ముంపు బాధితులు

*మహా నగరంపై మబ్బు దుప్పటి కమ్ముకున్నది. బంగాళాఖాతంతో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఆదివారం సైతం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరం తడిసిముద్దయింది. జనజీవనం స్తంభించింది. వరద పోటెత్తడంతో అల్లాపూర్, కూకట్‌పల్లి ఏరియాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమై...20 ఇండ్లు నీటమునిగాయి. సహాయక చర్యల్లో ఆలస్యం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పలు చోట్ల భారీ చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా, గంటలు గడిచినా.. పునరుద్ధరించకపోవడంతో పలు చోట్ల అంధకారం అలుముకున్నది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 610 బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా.. ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. మరోవైపు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తదితరులు క్షేత్రస్థాయిలో పర్యటించి.. సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా అత్యవసరమైతే తప్ప..నగర ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. మరోవైపు హుస్సేన్‌సాగర్, జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటి నిల్వలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ..పరీవాహక ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.* -సిటీబ్యూరో, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసారాంబాగ్ వద్ద మూసీ



## గ్రేటర్‌లో అంధకారం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలా చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి అంధకారం నెలకొంది. క్షేత్ర స్థాయిలో మరమ్మతులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమీర్‌పేట, ఎర్రగడ్డ, ఖైరతాబాద్, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ సర్కిల్, హబ్సిగూడ, మేడ్చల్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోని అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినా..వారు నిర్లక్ష్యం చేయడంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కిస్మత్‌పూర్ ఫీడర్ పరిధిలో ఒక ఫేజ్ సరఫరా నిలిచిపోగా, పునరుద్ధరణకు 3 గంటలు పట్టడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కరెంటు సరఫరా లేదని విద్యుత్ శాఖ సెక్షన్ అధికారులకు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా.. వెంటనే స్పందించలేదు. మియాపూర్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వినియోగదారులు ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే గ్రేటర్‌లోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో నగర వాసులు ట్విట్టర్ వేదికగా ఫిర్యాదులు చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో భారీ చెట్టు కూలడంతో కరెంటు నిలిచిపోయింది. విద్యుత్, బల్దియా బృందాలు చెట్టు కొమ్మలను తొలగించి, కరెంటు తీగలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. అలాగే పికెట్‌లోని లక్ష్మీనగర్, ఎంఈఎస్ కాలనీల్లో ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓల్డ్ కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని సరస్వతి స్కూల్ వెనకవైపు చెట్టు కరెంటు స్తంభంపై పడటంతో సరఫరాకు ఆటంకం కలిగింది.



నాగారం ఓల్డ్ విలేజీ మహంకాళి ఆలయం వద్ద విద్యుత్ తీగలపై పడిన భారీ చెట్టు

## ఉప్పొంగుతున్న చెరువులు

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరుతున్నది. జీహెచ్ఎంసీ పరిధిలో 185 చెరువులు ఉండగా, 28 నిండుకుండలా మారి అలుగు పారుతున్నాయి. స్లూయిస్ గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి దిగువ నాలాల్లోకి వరద నీటిని వదులుతున్నారు. ఈ నేపథ్యంలోనే చెరువుల దిగువ ప్రాంతంలో ఉన్న వారికి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం తలెత్తకుండా జీహెచ్ఎంసీ లేక్ విభాగం అప్రమత్తమైంది. సర్‌ప్లస్ చెరువుల వద్ద ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, న్యాక్ ఇంజినీర్లు, సూపర్‌వైజర్లతో పర్యవేక్షణ జరుపుతున్నారు. మరోవైపు హుస్సేన్‌సాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చి చేరుతున్నదని, ప్రస్తుతం 10, 400 క్యూసెక్కుల నీరును కిందకు వదలుతున్నామని అధికారులు తెలిపారు.

## అధికారులకు సెలవులు రద్దు



బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బల్దియా కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వద్ద వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ (సంపు) నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. కంట్రోల్ రూం 24 గంటలు పనిచేస్తుందని, అన్ని శాఖల సమన్వయంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలు, కంపౌండ్ వాల్స్, భవన నిర్మాణ ప్రదేశాలను డిప్యూటీ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు సందర్శించి ప్రమాద అవకాశాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అధికారులకు సెలవులను రద్దు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ ఏడాది ఉన్న 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను వచ్చే ఏడాదిలో 50కి తగ్గేలా ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు.

## ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడండి



పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారులు ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంతాల్లో పర్యటించారు. హిమాయత్‌సాగర్, గండిపేట, హుస్సేన్‌సాగర్ నీటి మట్టాలను గమనిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి, హెచ్ఎండీఏకు చెందిన మొత్తం 610 అధికారిక బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బిల్డింగ్ కార్మికులను సురక్షితమైన చోటుకు తరలించాలని దానకిశోర్ సూచించారు. వర్షాల కారణంగా భవన నిర్మాణాలు జరుగుతున్న చోట ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు క్రెడాయ్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. భవన నిర్మాణ కార్మికులను సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని క్రెడాయ్‌లో సభ్యులుగా ఉన్న బిల్డర్లు, డెవలపర్లకు సూచించామన్నారు.

## సమస్యలుంటే.. 040-2320 2813, 90634 23979

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర భవనాల్లో ఉంటున్న ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జియాగూడ మండి పక్కన మూసీ వరద నీటి ప్రవాహ వేగాన్ని పరిశీలించి లోతట్టు ప్రాంత ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే ప్రజలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 040-2320 2813, 90634 23979కు సమస్యలను తెలియజేయాలని, ఫోన్ కాల్స్‌పై సత్వరమే స్పందించాలని అధికారులకు సూచించారు. మరో 24 గంటల పాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ఇచ్చినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కూడా రద్దు చేసినట్లు చెప్పారు.

## మ్యాన్‌హోల్ మూతలు తెరవొద్దు

### జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో అశోక్‌రెడ్డి పర్యటించారు. డివిజన్ -3 పరిధిలోని మెహిదీపట్నం ఎంఎస్ డీసీ భవనం వద్ద సీవరేజీ పూడికతీత పనులను పరిశీలించారు. అలాగే జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ నగరంలోని బండ్లగూడ, హనుమాన్‌నగర్, గోడెకె ఖబర్ సెక్షన్ పరిధిలో సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఈఆర్టీ బృందాలు ఎప్పటికప్పుడు రహదారుల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తాగు, మురుగునీరు సంబంధించిన ఏమైనా సమస్యలుంటే జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఈడీ సూచించారు.



## మునిగిన ఇండ్లు..విరిగిపడిన చెట్లు

ఎడతెరిపి లేని వర్షాలతో నగరంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. కూకట్‌పల్లి, అల్లాపూర్ ప్రాంతాల్లో 20 ఇండ్లు నీటి మునిగాయి. వానకు తోడు బలంగా వీచిన గాలులతో గ్రేటర్ వ్యాప్తంగా 115 చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఇందులో 105 ప్రాంతాల్లో పరిష్కారం చూపామని, మిగిలిన 10 ప్రాంతాల్లో ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉన్నదని అధికారులు పేర్కొన్నారు. కాగా, 24 చోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక వివిధ సమస్యలపై జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు దాదాపు 150కి పైగా ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి.

### 24 ప్రాంతాల్లో నిలిచిన నీరు

బీహెచ్ఈఎల్ క్రాస్‌రోడ్, లింగంపల్లి రైల్వే స్టేషన్, శిల్పారామం, విప్రో, ప్రశాంత్‌నగర్, ఐడీపీఎల్ చింతల్, తుకారాంగేట్, మలక్‌పేట, బయోడైవర్సిటీ, జగద్గిరిగుట్ట, బంజారాహిల్స్, జేఎన్‌టీయూ, ఏఎస్‌రావునగర్, తార్నాక, సుచిత్ర, చంపాపేట, మల్లాపూర్, హస్తినాపురం తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



అల్లాపూర్ డివిజన్‌లో సహాయక చర్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం



గాంధీనగర్‌లో కారుపై పడ్డ చెట్టు

### విస్తారంగా వర్షాలు

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు బీహెచ్ఈఎల్‌లో అత్యధికంగా 8.53 సెం.మీలు, గచ్చిబౌలిలో 8.13, కేపీహెచ్‌బీలో 7.83, హైదర్‌నగర్‌లో 7.78, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 7.65, గాజులరామారం, మహదేవపురంలో 7.60, యూసుఫ్‌గూడలో 7.48, సరూర్‌నగర్‌లో 7.15 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మలక్‌పేటలో అత్యధికంగా 4.68 సెం.మీలు, అత్యల్పంగా రాజేంద్రనగర్‌లో 3.18 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



## చుక్క నీరు నిల్వొద్దు

చెరువులు, కుంటలు, నాలాల కబ్జాలతో వర్షం కారణంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకోవడానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదివారం స్వయంగా రంగంలోకి దిగారు. అమీర్‌పేట, షేక్‌పేట, టౌలిచౌకీ, గచ్చిబౌలి, కొండాపూర్, అత్తాపూర్ వంటి ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశాల్లో పర్యటించారు. విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బందితో మాట్లాడారు. వర్షపు నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్ఎఫ్ బృందాలను అధికారులను సమన్వయం చేసుకుంటూ విపత్తు నిర్వహణ చర్యలు చేపట్టాలన్నారు.
– సిటీబ్యూరో/మెహిదీపట్నం